
# ఓ కొడుకు నిర్ణయం

"మీరు నాతలపై జీలకర్ర బెల్లం వుంచి - నాతిచరామి అన్నారు అప్పట్నుంచీ మీ సుఖదుఃఖాల్లో నాకు సగభాగం వుంటుంది కదా అందుకని....." విమల వాక్యాన్ని పూర్తి చేయలేదు. భానుమూర్తి చేయి విమల చేతిని మృదువుగా స్పర్శించింది. ఆ స్పర్శానుభూతితో తనలోకి అనంతమైన హాయి ప్రవహిస్తున్నట్టు అనుభూతి చెందింది విమల. బహుశా సుఖం అంటే ఇదేనేమో!

"పడుకోండి. చాలా ప్రొద్దు పోయింది" బెడ్‌లాంప్ వేస్తు అంది - పెందరాళే లేవాలి బోల్డంత పనుంది అని మనసులో అనుకుంటూ.

* *



**– ప్రియదర్శిని**

చీర చెంగుకి చేతులు తుడుచుకొంటూ గదిలోకి అడుగు వేసింది విమల. కళ్ళు మూసుకొని అసహనంగా తలరుద్దుకొంటున్న భర్తని చూడగానే ఆమెలో ఆదుర్దా పెల్లుబికింది. "ఏమండీ... తల నొప్పిగా వుందా?" ఒక్క అంగలో దగ్గరికి చేరి తలమీద చేయి వేస్తూ అడిగింది.

కళ్ళు మూసుకునే తల అడ్డంగా తిప్పాడు భానుమూర్తి.

"మరెందుకలా రుద్దుకొంటున్నారు? పోనీ అమృతాంజనం రాసేదా?"

"వద్దు"

"వద్దా?" భర్త సమాధానం విమలకి ఆశ్చర్యాన్ని కలిగించింది.

"అయినా ఓ నిజం చెప్పు? నీకు మాత్రం తలనొప్పిగా లేదూ?"

ఆశ్చర్యంలో నుండి తేరుకోకుండానే భర్త నుండి ఎదుర్కొన్న ప్రశ్నతో మరింత ఆశ్చర్యపోయి కళ్ళు పెద్దవి చేసి చూసింది విమల. తనకు ఒక్క తలనొప్పి ఏమిటి - ఒళ్ళంతానొప్పి! ఈ గదిలోకి అడుగు వేసి వేయగానే మేనువాల్చి హాయిగా నిద్దరోవాలనే వుంది.

"మాటాడవేం?" భానుమూర్తి రెట్టించడంతో విశాలంగా నవ్వింది విమల. ఆ తరువాత "ఔను వుంది" అంది. నే చెప్పలేదూ అన్నట్టు చూసాడు భానుమూర్తి. ఆ వెంటనే బాధగా నిట్టూర్చాడు. విమల ఆ నిట్టూర్పునేం పట్టించుకోలేదు. "కానీ నాది మీలాంటి తలనొప్పి కాదు" అంది.

"మరి?"

"నాన్నా" వీధి గుమ్మం దాటబోతున్న రాఘవయ్య ఒక్కసారి వెనక్కి తిరిగిచూసారు. అయనకి ఆశ్చర్యం వేసింది. పిలుస్తోంది కొడుకు. తను ఇలా బయటికి వెళుతుంటే అపుచేసేంత అవసరం ఏం వచ్చిందో అర్థం కాలేదాయనకి. కళ్ళజోడు వెనకాతల నుండి "ఏం?" అన్నట్టు చూసారు. అది భానుమూర్తికి అగుపడలేదు. అయినా చెప్పాడు "సాయంత్రానికల్లా వస్తారుగా! మీతో మాటాడాలి" ఈసారి అయన మొహంలో సుదురు ముడిపడింది.

"ఏమిట్రా!" అన్నారు అదేదో ఇప్పుడే చెప్పకూడదా అన్న ఆతృతని ధ్వనింప చేస్తూ.

"ఊహు.. మీరెళ్ళిరండి సాయంత్రం చెబుతాను.

కొడుకు ఏం మాట్లాడాలనుకున్నాడో చప్పున తట్టలేదు ఆయనకి. దాంతో చిరాకు కల్గింది. అలాగని వెనక్కి తిరగనూ లేకపోయారు. విధిలేక బయట పాదం మోపారాయన. కొడుకు మాటాడాలి అన్న క్షణంలోనే ఉత్సాహం చచ్చిపోయింది.

'ఇదివరకెన్నడూ ఇలా అడగని కొడుకు ఈ వేళ ఎందుకలా అడిగాడు?' అన్న ప్రశ్న కలవరపెడుతోంది.

భానుమూర్తి కేక ప్రక్కగదిలో వున్న అతని తల్లి వర్ధనమ్మ చెవిలోనూ పడింది. గబగబా బయటికి వచ్చి కొడుకును విషయం కనుక్కోవాలనుకొంది కూడా. కానీ రెండు మూడు రోజుల నుండి భానుమూర్తి మౌనంగా అంటీ ముట్టనట్టు వుంటున్నాడు. ఆ విషయం గుర్తించీ తను ఇంతవరవకూ నిలదీయలేదు. అలాంటిది ఇప్పుడు ఇలా వెంటనే అడిగితే? - "బావుండదు" అనుకొంది వర్ధనమ్మ రెండు మూడు నిముషాలు సర్దినట్టు చేసి తిన్నగా వంటింట్లోకి వెళ్ళింది "విమలా" అంటూ.

చారులోకి పోపు పెడుతోన్న విమల అత్తగారి పిలుపుకి ఇటు తిరక్కుండానే 'ఏంటత్తయ్యా' అంది

గది లోపలికి వచ్చింది వర్ధనమ్మ - "మూర్తి వాళ్ళ నాన్నతో ఏదో మాటాడాలి అంటున్నాడు. ఏంటిట?.."

ఈసారి ఆశ్చర్యపోవడం విమల వంతయ్యింది. భర్త మామగారితో మాటాడాలి అన్నాడా ఏ విషయం! తనతో మాట మాత్రంగానైనా అనలేదేం!

కోడలు ఆలోచనలో పడి మౌనం వహించడంతో మరింత అనుమానం వేసింది వర్ధనమ్మకి. భార్యా భర్తలిద్దరూ కలిసి ఏదో గూడుపుఠాణీ పన్నుతున్నారన్న అనుమానం కల్గింది. ఆ వెనువెంటనే చెప్పలేనంత కోపం వచ్చింది.

"మాటాడవేం విమలా?"

అత్తగారి రెట్టింపుకి ఆలోచనలనుండి బయట పడింది విమల.

విమలా "నాకేం తెలీదత్తయ్యా" విమల కంఠంలో తొట్రుపాటు

"తెలీదా?" కోడలు అంతా ఎరిగి ఏమి ఎరగనట్టు ప్రవర్తిస్తూందని రూఢీ చేసుకొంది. ఆవేశం ఆగ్రహం ఆమెలో చిందులు వేసాయి. తను కన్నకొడుకుతో కుమ్మక్కయి.... "సరేలే అమ్మా. ఎందుకు చెబుతావు చెప్పకులే. సాయంత్రం ఎలాగూ చెబుతానన్నాడు కదా మీ ఆయన, అప్పుడే వింటాలే" విసురుగా అక్కసునంతా వెలికక్కిందావిడ. అత్తగారి అకారణకోపానికి దుఃఖం వచ్చింది విమలకి. వారానికి ఒక్క ఆదివారం ఈ వంటపని త్వరగా తెముల్చుకొని ఆ బట్టల పనీ అయ్యింది అనిపించి కాస్సేపు విశ్రాంతి తీసుకోవాలనుకొంది. కానీ శారీరకమైన విశ్రాంతికన్నా విలువైన మనశ్శాంతి లోపించిందీవేళ" మథనపడసాగింది విమల.

* *

సాయంత్రం.

భానుమూర్తి తండ్రి వసారాలో కుర్చీలో కూర్చున్నారన్నమాటే గానీ మనసులో మనసులేదాయనకి. రోజూ అక్కడే కూర్చుని విశ్రాంతి తీసుకుంటారు. కానీ ఉదయం కొడుకు తనతో మాటాడాలి అన్నప్పటినుండి ఏమీ తోచడం లేదు. విషయం ఏమిటా అని మనసు రొదపెడుతోంది. ఏం మాటాడతాడో అన్న ఆత్రుతతో పాటు ఏం వినాల్సి వస్తుందో అన్న భయమూ చోటు చేసుకొందాయనలో.

దాదాపు వర్ధనమ్మ స్థితీ అలాగే వుంది. ఏ గాలి దుమారం, లేకుండా వర్షించబోతున్నాడేమిటి వీడు అని ఆవిడ ఒకటే ఐదవుతోంది. ఆ అసహనంతోనే సినిమాకెళతానన్న కూతుర్ని అన్నమానం సినిమాలేమిటని కసిరింది. ఆడుకోనేందుకు వెళుతున్న చిన్న కొడుకుని కేకలేసి ఆపింది. అయినా స్థిమితపడలేదు మనసు.

ఖచ్చితంగా కోడలు ఏదో నూరిపోసిందని పదేపదే అనుకోసాగింది. అలా అనుకోగానే కోపం వెల్లువై ఆమెను నిలవనీయడంలేదు.

వసారాలో అడుగేయగానే భానుమూర్తి తల్లిదండ్రులిద్దరి మొహాల్లో ప్రస్ఫుటమౌతున్న ఆశ్చర్యాందోళనలు ఇట్టే పసిగట్టాడు. తన ఉనికిని తెలియబరిచే ఉద్దేశ్యంతో చిన్నగా దగ్గాడు. ఆలోచన్ల నుండి ఉలిక్కిపాటుతో బయటపడ్డట్టు తలెత్తి చూసారిద్దరూ. నోటి నుండి పలుకే రావడం లేదు. ఆ బ్రహ్మాయుత్నం చేసేందుకు కూడా సిద్ధంగా లేరు.

రెణ్ణిముషాలు మౌనం వీరవిహారం చేసాక గొంతు సర్దుకొన్నాడు భానుమూర్తి. అతడిలోనూ తొట్రుపాటు వుంది. విషయాన్ని ఎలా చెప్పాలా అని మథనపడుతున్నవాడిలా వున్నాడు, "విమలా గ్లాసుతో నీళ్ళు పట్రా" లోపలికి చూస్తూ కేకేసాడు. విమల అందించిన నీళ్ళని గడ గడ త్రాగి - గ్లాసు అందిస్తూ చెప్పాడు

"కూర్చో"


ఆశ్చర్యంగా భర్తకేసి చూసింది విమల. అక్కడ అత్తగారు మామగారు.... తనను కూర్చో అనడం విస్మయాన్ని కాక మరేం కలిగిస్తుంది!

"ఇప్పుడు నే చెప్పబోయే విషయం నువ్వు వినాలి విమలా అందుకే కూర్చో అంటున్నాను"

మాటలాడకుండా మామగారికి కాస్త వెనకవైపు నేలమీద చతికిలపడింది విమల. ఓ కంట అత్త మామలు తనను గమనిస్తూ వుండి వుంటారనుకుంటూ.

"నాకు తెలుసు మీకందరికీ ఆశ్చర్యంగా వుందని. కానీ తలబ్రద్దలు కొట్టుకునే శక్తి నాలో సన్నగిలాక.. నాకు తప్పనినరి అన్పించి ఈ చర్యకు పాల్పడ్డాను" తల్లిదండ్రుల మొహాల్లో మరింత ఆతృత చోటు చేసుకోవడం గమనించాడు.

"ఈ దేశంలో ఆడపిల్లగా పుట్టడమే దురదృష్టం అనుకొంటారు చాలా మంది. నాకు మాత్రం మగాడిగా పుట్టడమూ దురదృష్టమే ననిపిస్తోంది. బాగా ఆలోచిస్తే తల్లిదండ్రులు ఆడ-మగ సంతానం పట్ల భిన్నంగా ప్రవర్తించినా ఒకేలా ఆలోచిస్తారు అన్పిస్తుంది. కాదా? ఆడపిల్లయితే కట్నంతో వదిలించుకోవడం ఎలా అని దిగులు పడతారు. మగపిల్లాడికి ఎంత ఎక్కువ కట్నం పుచ్చుకోవాలా అని మథనపడతారు. ఆ మాటకొస్తే ఆడపిల్లగానే నయం. మా వాళ్ళు కష్టపడి డబ్బు సంపాదించి నాకోసం ఖర్చు పెట్టారు కదా అన్నసానుభూతి వుంటుంది ఆడపిల్లకి. కానీ మగపిల్లాడికి-? చిన్నప్పటి నుండి పెంచేతీరు వేరు. ఇంటికి



చురక

నగరంలో ఆర్ట్ ఎగ్జిబిషన్ జరుగుతోంది. డెబ్బై యేళ్ళ సుప్రసిద్ధ చిత్రకారుడు ఒకాయన ఆ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్నాడు. ఎగ్జిబిషన్ చూడడానికి వచ్చిన ఒక విమర్శకుడు ఆ చిత్రకారుడ్ని చూసి పలకరించి - 'ఈ మధ్య మీరు కన్నావరేషన్ చేయించుకున్నారట కదా... ఇప్పుడు మీరు బాగా చూడగలుగుతున్నారా!' అని అడిగాడు. దీనికి ఆయన 'పర్వాలేదు... ఒకవేళ అంతగా చూపు పూర్తిగా దెబ్బతింటే విమర్శకుడ్ని అవుతాను' అని సమాధానమిచ్చాడు.

పెద్దవాడయితే బాధ్యతలు తెలిసేటట్టు - త్వరగా ఉద్యోగం వచ్చే చదువు చదివిస్తారు. ఆ తరువాత చెల్లెలి వివాహానికి సరిపడా కట్నం ఇచ్చే అమ్మాయితో వివాహం జరిపిస్తారు. అందరూ ఇలాగే ప్రవర్తిస్తారనడం లేదు నేను. సగటు అబ్బాయిల జీవితం ఇది. అమ్మాయి నచ్చడం నచ్చకపోవడం అన్నది నామమాత్రమే అన్పిస్తుంది నాకు. పోనీ ఇంతటితో ఆగుతుందా అంటే ఉహూ. అది కుదరనే కుదరదయ్యో! కట్నం తక్కువగా తెచ్చిందనో, ఇంట్లో సరిగ్గా వ్యవహరించడం లేదనో, కొడుకును తనకు కాకుండా చేస్తుందనో.. నా భర్త నావాడయినప్పుడు వీళ్ళంతా ఏమిటనో.. ఇలా భిన్నాభిప్రాయాల్తో చేతలతో మాటలతో తలపడే తల్లి, భార్యకి నడుమ ఆ వ్యక్తి ఏం కావాలి! అటు తల్లి ఇటుభార్య ఎవరివైపు మొగ్గాలి మగవాడు. ఎవరిపట్ల కాస్త మొగ్గు చూపినట్లు కనిపించినా - అతడు ఇంటాబయట చెడ్డవాడై పోతాడు...." ఆగాడు భానుమూర్తి.

శ్రోతలు తన మాటల్లో అర్థాలు వెదక్కునేందుకు శ్రద్ధగా వింటున్నారు. ప్చ్!

"కట్నాలు తెస్తోన్న భార్యలు వస్తుంటే ఇవా ఇబ్బందులేముంటాయి అంటారు. డబ్బు అన్ని సమస్యలను పరిష్కరిస్తుందో లేదో కానీ కొన్ని సమస్యలకి మాత్రం ఆస్కారమిస్తుంది. కదు నాన్నా." కొడుకు మాటల సారాంశం ఏమిటా అని ఆలోచిస్తున్న రాఘవయ్య తత్తరపడ్డాడు. "ఔ..ఔనవును" అన్నాడు.

"డబ్బు ఒక్కటి వుంటే మరేమీ అవసరం లేదు కదమ్మా" అన్నాడు తల్లివైపు తిరిగి. తనూ ఓ ప్రశ్నను ఎదుర్కోవాల్సి వస్తుందని పూహించని వర్ధనమ్మ నిరుత్తురురాలై చూసింది. కొడుకు ఎందుకలా అడుగుతున్నాడు. వాడి ఇష్టప్రకారమే జరిగిందిగా పెళ్ళి. అందులోనూ కట్నం లేకుండా కేవలం లాంఛనాలతో మాత్రమే - వర్ధనమ్మ మనసు మూలిగింది. కానీ ఎప్పటిలా గట్టిగా మాటాడలేక పోయింది.

"అందుకే ఆడబ్బును మీకు నెలనెలా-ఇస్తూ మేము వేరుగా వుంటాం నాన్నా. "అన్నాడు భానుమూర్తి. పిడుగు పడినట్లయ్యింది వర్ధనమ్మకి. కళ్ళజోడు వెనకాతల నుండి చూపుల్నికాక ఆశ్చర్యాన్ని ప్రసరించేడు రాఘవయ్య "ఔనమ్మా. విమలను ఇష్టపడ్డానని - మీరు సంపూర్ణంగా ఇష్టపడి పెళ్ళి చేయలేదు. వివాహం తరువాత సమస్యలు తలెత్తుతాయన్న అనుమానాన్ని అనాడు వ్యక్తం చేసాను, విమల ముందు. మీ ఇంట్లో వుండేది మాత్రం మనుమలు కారా! అన్నీ సర్దుకొంటాయంది. కానీ సర్దుకుపోవడం మన ఇంటావంటా లేనట్టు ప్రవర్తిస్తున్నారు." ఆగి తల్లి వంక చూసాడు భానుమూర్తి. పూర్తి సంకటంలో కూరుకుపోయినట్లుంది ఆమె. "ఒకప్పుడు నాన్న సంపాదన మనందరికీ సరిపోయేది. కానీ ఇప్పుడు ముగ్గురిదైనా చాలడంలేదు. ఇదివరకు చేసుకున్న ఇంటి పనులు బరువైపోయాయి. మన ఇంటి పనులు మనకే బరువుకావడం - కేవలం ఒక్క మనిషి ఇంట్లోకి అడుగేయడం వల్ల కలిగిన మార్పు పోనీ ఇవన్నీ పని మనుమలతో చేయించగలం. కాని సహకారం లేని కుటుంబసభ్యుల మధ్యన మెలగడం మాత్రం...." నిట్టూర్చి చెప్పాడు భానుమూర్తి "నా వల్లకావడం లేదు నాన్నా"

వర్ధనమ్మకి క్లూ దొరికినట్లయ్యింది. "వీడి పెళ్ళాం కష్టపడిపోతుందని కాబోలు ఇదంతా" అనుకొంది. తల్లి తండ్రీ ఏమైనా మాటాడతారేమో నని ఎదురు చూసాడు భానుమూర్తి. దాదాపు ఐదు నిముషాలు నిశ్శబ్దం రాజ్యంఏలింది.

'మాటాడవేం అమ్మ'

"ఏం మాటాడను నాయనా" అంది వర్ధనమ్మ వద్దనుకున్నా

ఆమెలోని కోపం వెలికిందా మాటల్లో.

తండ్రి వైపు చూసాడు భానుమూర్తి. దీర్ఘాలోచనలో మునిగి వున్నట్టు ఆయన ఎవరి వంకా చూడటం లేదు.

"నేను నా భార్య మీద వున్న ఇష్టం కొద్ది ఈ పని చేయడం లేదు. ఆమాటకు వస్తే ఇందులో విమలయత్నం ఏమీ లేదు. మీరు నమ్మకపోవచ్చు కానీ.. వాళ్ళకి ఇంత కట్నం ఇచ్చార్ట. ఫలనా వారబ్బాయికి ఇంత ఇస్తే కానీ చేసుకోమంటున్నార్ట, లాంటి మాటల్తో పాటు దేనికైనా అద ృష్టం వుండాలి అంటూ వేడి నిట్టూర్పులు విడవడం, విన్నప్పుడు విమల ఎలా ఫీలయ్యేదో కానీ నాకే బాధగా వుండేది. తను కట్నం తేలేదు కానీ నెలనెలా జీతం తెస్తోంది కదా? బోడి జీతం అంటారేమో గానీ రేపు చెల్లి పెళ్ళికి మనం ఎంత ఇవ్వగలం? తను చదువు పూర్తి చేసేసరికి వీటి రేటు ఇంకెంత పెరుగుతుందో ఆలోచించారా! మరో ఇంటి ఆడపిల్లలాగే మన అమ్మాయి ఇలాగే మానసిక క్షోభను అనుభవించ వచ్చు కదా?"

కొడుకు సూటిగా తన వంకే చూస్తున్నాడన్న అనుమానం కలిగింది వర్ధనమ్మకి. తలదించుకొని వున్న ఆమెకి కొడుకు చూపులు తనని పూర్తిగా కప్పేసినట్లనిపించింది.

"గొంతెమ్మ కోర్కెలకీ అత్యాశలకి కొడుకులు ప్రతి రూపాలు కావాలనుకొనే తల్లులుండడం దురదృష్టం! వాటికి మౌనంగా తలొంచిన వాళ్ళు ఎందుకున్నారో! చెప్పమ్మా అప్పుడేం చేస్తావు?"

కొడుకు తననిలా నిలదీయడం అస్సలు నచ్చలేదు వర్ధనమ్మకి గుర్తొచ్చి పిల్లని వెక్కిరించడం అంటే ఇదేనేమో. వేరు కాపురం పెడతానన్నవాడు వెళ్ళకుండా ఇవన్నీ ఎందుకు సాగదీస్తున్నట్టు-? ఆవిడలో ఆవేశం పరవళ్ళు త్రొక్కుతోంది. కానీ వివేకం మేల్కొనడం లేదు. "వివాహమే చేస్తాను. లేదంటే దాని మెడకి ఉరితాడు బిగిస్తాను. దాని ఊసు నీకెందుకులే నాయనా! హాయిగా కాపురం చేసుకో" రుసరుసలాడుతూ లేచింది వర్ధనమ్మ.

తండ్రికూడా అదే తీరులో లేచి వెళతాడేమో ననిపించింది భానుమూర్తికి. రెణ్ణిముషాలు ఎదురు చూచాడు. తండ్రి కదలకపోవటంతో నెమ్మదిగా అన్నాడు "నాన్నా ఇందులో విమల ప్రయత్నం ఏమీలేదు. ఆమెలోని సంస్కారపు పొరకి ఇప్పటికే ఛిద్రాలు పడ్డాయి. అది చిరిగే వరకూ నిరీక్షించడం నా అవివేకం అవుతుంది. నాకు తెలుసు మనింట్లో నిశ్శబ్దం మాటున పెరుగుతున్న అసహనం ఏదోరోజున విద్వేషంతో బయటపడితే పరిస్థితి మరింత అసహ్యంగా వుంటుంది. అలాంటి వాతావరణంలో ఉండలేక పోవడం కన్నా కాస్త స్వేచ్ఛా వాయువుల్ని పీల్చుకోవాలనుకోవడం అత్యాశా? ఇలాంటి వాతావరణంలో పెరిగే పిల్లలు కూడా మానసిక వికాసం లేక సరిగ్గా ఎదగలేరేమో నని..."

ఆగి భార్యవంక చూసాడు భానుమూర్తి. ఆమె అతని వంక చూడడం లేదు. ఎదలోపల గుప్తంగా దాచుకొన్న దుఃఖం నిశ్శబ్దంగా బుగ్గల మీది నుండి జారుతోంది.

"విమలా అన్నీ సర్దు ఈ ఆదివారమే మనం వెళ్ళేది." ప్రక్కగదిలోకి వెళ్ళిన వర్ధనమ్మ మనసు మొద్దు బారిన ట్లయ్యింది. ఏమీ ఆలోచించే స్థితిలో లేదామె. భానుమూర్తి తండ్రి కళ్ళలో మాత్రం లిప్తపాటు సంతోషం తళుక్కు మంది. కొడుకు వేరుకాపురం పెడుతున్నాడని కాదు. తను తాత కాబోతున్నాడని. వాత్సల్యంగా కోడలుకేసి చూసాడు. ఆమె బుగ్గల మీదుగా కన్నీళ్ళు! ఎన్నో భావాలకి భాష్యం చెబుతున్నట్టు.

□

# ఆరు సూత్రాల ఆనందమార్గం



భార్యా భర్తల మధ్య చిన్న చిన్న కలహాలు రావడం, ఎవరికో ఒకరికి చిలిపి కోపం వచ్చి ఇద్దరూ ఎడమొహం పెడ మొహంగా వుండడం తరచు జరిగే విషయమే. వివాహం జరిగిన తర్వాత మొదటి రోజుల్లో ఒకరిమీద ఒకరికి విపరీతమైన ఆకర్షణ వుంటుంది. ప్రపంచాన్ని మరచిపోయి ఆనందాన్నే భార్యాభర్తలు వెతుక్కుంటూ వుంటారు. రోజులు గడుస్తూ వుంటే బాధ్యతలు గుర్తుకు వస్తాయి, పెరుగుతాయి కూడా. అప్పుడే సమస్యలు తలెత్తుతాయి. భార్యా భర్తలలో ఏ ఒక్కరిలో సర్దుకుపోయే గుణం వున్నా చాలు ఆ సంసారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వుంటుంది (ముగ్గురు కొడుకులు ఆరుగురు కూతుళ్ళు కాదు సుమా!).

భార్యాభర్తలలో వుండవలసినవి, వారు అలవర్చుకో వలసినవి ఏమిటని యిటీవలే విస్తృతంగా పరిశోధనలు జరిగాయి. ఇవి తెలుసుకుని అవసరమయినప్పుడు ఆచరణలో పెడితే చాలు ప్రతి కుటుంబమూ చక్కగా చల్లగా వుంటారు. అవి ఏమిటో చూద్దాం.

**ఒకటి:** భార్య భర్తని కాని, భర్త భార్యని కాని సున్నితంగా విమర్శించవచ్చు. అయితే పెద్ద అపరాధం చేసినట్లు, క్షమించరాని నేరం అది అయినట్లు మాట్లాడకూడదు. "డియర్ ఈ చిన్న తప్పు చేశావు. నువ్వంటే నాకు ఎంతో ఇష్టం. అందుకే చెప్తున్నాను. ఏమను కోకు" అనాలి. అంతే! ఆ తప్పు మళ్ళీ జరగదు.

**రెండు:** తీవ్రమైన అభిప్రాయ బేధాలు ఒక విషయంలో వచ్చినప్పుడు ఎవరు ఏమి మాట్లాడుతున్నారో తెలీక భార్యాభర్తలు గొంతు చించి పోట్లాడుకో వలసిన అవసరం లేదు. బొమ్మా, బొరుసు వేసి ముందు ఎవరు మాట్లాడాలో నిర్ణయించుకోవాలి. ఒక అయిదు నిమిషాలు ఒకరు మాట్లాడాక, రెండవ వారు తమ వాదన వినిపించాలి. అలా వాతావరణంలో వేడి తగ్గి టెంపరేచర్ నార్మల్‌కి వస్తుంది. అభిప్రాయాలకి విలువ లభిస్తుంది. భేదాలు మటుమాయమయి పోతాయి.

**మూడు:** అవతలి వారు చెప్తున్నది మనసు పెట్టి ఆసక్తిగా వినాలి. వినకుండా వుండ కూడదు. వింటున్నట్లు నటించకూడదు. ఇందులో 'టైమ్ వేస్ట్' అన్నదే లేదు. భార్య చెప్పేది భర్తకి, భర్త చెప్పేది భార్యకి కాకపోతే మరెవరికి?

**నాలుగు:** భర్త ఆఫీసు నుంచి అలసిపోయి ఇంటికి వస్తాడు. కొంచెం ఆలస్యం అవుతుంది. ఆకలితో కడుపు మాడిపోతూ వుంటుంది. 'ఎందుకు ఆలస్యం' అని భార్య అడగ కూడదు. అలాడిగితే భార్య మీద మండిపోవచ్చు. ఈ సున్నితమైన విషయాన్ని భార్య అర్థం చేసుకోవాలి.

అలాగే ఇంటిపనులు, వంటపనులు చేసి అలసి పోయిన భార్య విషయంలోనూ భర్త సున్నితంగా వ్యవహరించాలి. శరీరానికి తగిన గాయాలకి ఆయింట్‌మెంట్లు వున్నాయి. పర్వాలేదు. కానీ మనసుకి గాయం తగల కూడదు

**అయిదు:** భార్య భర్తల మధ్య వచ్చిన అపోహలు, అపార్థాలు నాలుగు గోడలు దాటి బయటకు వెళ్లకూడదు. భార్యాభర్తల మధ్య అడ్డు గోడలు ఏర్పడకుండా చూసు కోవాలి. ఒక వేళ ఏర్పడితే నిశ్శబ్దంగా తొలగించాలి.

**ఆరు:** ఆదాయానికి, వ్యయానికి ఎప్పుడూ లంగరు అందాలి. ఆదాయం కన్నా వ్యయం పెరిగితే అప్పులు, కష్టాలు. ఆదాయం కన్నా వ్యయం తక్కువగా వుంటే మిగులు, ఆనందం. ఇక్కడ అంతరంగిక వ్యవహారాల శాఖ, ఆర్థికశాఖ భార్యే నిర్వహించాలి.

—ఎ.నైపుణ్య